క్లుప్తంగా

8న ఉచిత కంటి వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీ కాలనీలోని లయన్స్ కంటి హాస్పిటల్‌లో ఈనెల 8న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్ కంటి ఆస్పత్రి చైర్మన్ భాస్కర్‌నాయుడు తెలిపారు. ప్రముఖ కంటి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 నుంచి 12.30 వరకు పరీక్షలు చేస్తారన్నారు. అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న కాలనీకి దారి సౌకర్యం

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని మదనపల్లి రోడ్డు సీఎల్ఆర్‌సీ సమీపంలోని జగనన్న కాలనికి దారి సమస్య పరిష్కారమైంది. కాలనీవాసుల వినతిమేరకు పరిశీలించిన తహసీల్దారు భాగ్యలత దారికి స్థలం కేటాయించారు. ఈ మేరకు కాలనీ వాసులు జేసీబీ సాయంతో దారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో దారి సమస్య తాత్కాలికంగా తీరినట్లైంది. అయితే ప్రభుత్వ లేఅవుట్ మేరకు పూర్తి స్థాయిలో దారి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

6న ఉచిత డెంటల్ క్యాంపు

మదనపల్లె సిటీ: స్థానిక ఎన్జీవో హోం నందు ఈనెల 6 (ఆదివారం) ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 2 వరకు క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ దంతవైద్యులు దంతపరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పెద్దతిప్పసముద్రం: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో గోపూజ, అమ్మవారికి పంచామృతాభిషేకం, శ్రీసూక్త హోమం, దుర్గా హోమం, పూర్ణాహుతి, కుంకుమార్చన, మహా మంగళహారతి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులు త్వరలో పూర్తి

పీలేరు రూరల్ : వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తామని ఆ శాఖ మదనపల్లె డీఈఈ పి. కరీముల్లాఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం, తంబళ్లపల్లె 50 పడకల ఆస్పత్రుల నిర్మాణ పనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయన్నారు. కలికిరి 50 పడకలు, పీలేరు వంద పడకల ఆస్పత్రుల నిర్మాణ పనులు సెప్టెంబరు ఆఖరికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సర్పంచ్ హబీబ్‌బాషా, వార్డు మెంబరు ఉదయ్‌కుమార్, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

మదనపల్లె సిటీ: చదువులో రాణిస్తేనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని విశ్రాంత బ్యాంకు అధికారి అమరనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఏడాదది 9వ తరగతిలో మంచి మార్కులు సాధించి రాణించిన విద్యార్థులకు కోసూరి నళిని స్మారక పురస్కాలు అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థిని, తమ కుటుంబ సభ్యురాలైన కోసూరి నళిని పేరుతో ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. గత ఏడాది మంచి మార్కులు సాధించిన షేక్ సోనూ, శిరీష,తరుణ్‌రెడ్డి, హర్షితలకు ఒక్కొక్కరికి రూ.5000 నగదు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక సమస్యల నివారణపై అవగాహన ర్యాలీ

కేవీపల్లె : మానసిక వ్యాధిగ్రస్తుల పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఉదయ్‌కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లేళ్ల మంద పీహెచ్‌సీ నుంచి మానసిక సమస్యల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో మానసిక సమస్యతో బాధపడుతున్న పది మందికి పరీక్షలు నిర్వహించడంతోపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. మానసిక సమస్య ఉన్నవారికి సూచనలు, సలహాలు పొందడానికి 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీహెచ్ఈవో శివారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 19 మంది ఎంపిక

పీలేరు : ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 19 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఫుణ్ణల్ కంపెనీ హెచ్ఆర్ బాల భార్గవ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 90 మంది హాజరు కాగా 19 మంది ఎంపికైనట్లు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని మందలవారిపల్లె పంచాయతీలోని దండువారిపల్లె, యర్రగుట్టపల్లె, మందలవారిపల్లె, ఎస్సీ కాలనీ, మందలవారిపల్లె తండా, అవికేనాయక్‌తండా పంచాయతీలోని దేనేనాయక్‌తండా, అవికేనాయక్‌తండా, షేకేనాయక్ తండా, దిగువపల్లె పంచాయతీలోని వడ్డివంకతండా, తుమ్మలవంకతండా, దేవళంవంకతండా, దిగువపల్లె, బండేవాండ్లపల్లె గ్రామాలలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెల్లో, తండాలలో ఎమ్మెల్యేకి ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. పథకాల ద్వారా చేకురిన లబ్ధి గురించి ప్రజలతో ఆయన ముచ్చటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ప్రతి పల్లెకు రోడ్డు సౌకర్యం, తాగునీరు, అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. పెద్దమండ్యం మండలంలో ఎవ్వరూ ఊహించని అభివృద్ధి జరిగిందన్నారు. అవికేనాయక్‌తండా పంచాయతీలోని దేనేనాయక్‌తండాలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే షేకేనాయక్‌తండాలో ఆర్‌వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. పారదర్శకంగా, ఆదర్శవంతంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, ఎండీసీ అధ్యక్షుడు రమేష్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ గౌరీశంకర్, సర్పంచ్‌లు వై రమణమ్మ, బి వాసవి, మండల కన్వీనర్ చాను, మండల జీఎస్‌వి కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రమణారెడ్డి, భరత్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



దేనేనాయక్‌తండాలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత –ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సాకిబండవారిపల్లె, పడమటివారిపల్లె, పందివారిపల్లె గ్రామాల్లో సర్పంచ్ శ్రీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు నవీన్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ రామమోహన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లారు. ప్రజలను పలకరిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల కుటుంబాలకు అందించిన సాయాన్ని వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం బుక్‌లెట్‌ను అందించారు. ఇంకా గ్రామంలో ఏవైనా సమస్యలు ఉన్నాయని అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మురుగు నీటికాలువలు, సిమెంట్ రోడ్లు, అదనంగా మంచి నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, రెవెన్యూ సమస్యలు వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యేను పలువురు కోరారు. ప్రజలు లేవెత్తిన సమస్యలను పరిష్కరించేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ మంజుల, కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ, చెంద్రాయుడు, సుబ్రమణ్యం,నాయకులు యుగంధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దొర, శిధర్‌రెడ్డి దూకుడు వెంకటరమణ, మహేష్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

దారికి అడ్డుపడితే చర్యలు

కలకడ : నిబంధనలకు విరుద్ధంగా దారికి అడ్డుపడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ అక్కన్నగారికోటకు చెందిన చిన్నప్ప కుమారుడు సిద్దయ్యనాయుడు భూమికి ప్రభుత్వ నిబంధనల మేరకు దారి ఉన్నా అదే గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 768, 769, 770 లో తిరుపతి, చిన్నరెడ్డెప్ప, పెద్దరెడ్డెప్ప, సహదేవ, రామారావు, అక్కులమ్మ అడ్డుపడుతున్నారు. రైతు సిద్దయ్యనాయుడు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు శుక్రవారం సీఐ నాగేంద్ర, తహసీల్దార్ ప్రదీప్, ఎస్ఐ సిటిస్వామి కలిసి రెవెన్యూ రికార్డుల ప్రకారం దారిని కొలచి హద్దులు చూపి రాళ్ళు నాటించారు. కార్యక్రమంలో పంచాయతీ, రెవిన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దంత సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి

పీలేరు రూరల్ : దంత సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని దంతవైద్య నిపుణులు డాక్టర్ మౌనిక, డాక్టర్ భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వాసవిక్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ భోజనానికి ముందు, తరువాత దంతాలను శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. 73 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మందులు, టూత్ పేస్టు, బ్రెష్‌లు పంపిణీ చేశారు. పామిడి నాగరాజ, సురేష్‌బాబు, అరవిందబాబు, శివఫణేష్, మహిందర్, శంకర్‌నాథ్, నరసింహులు, సుబ్బరాజశెట్టి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తాం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బోడుమల్లువారిపల్లె కస్పాలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. గ్రామంలో మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అప్పటికప్పుడే సంబంధిత అధికారులు తెలిపి తక్షణం సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు ఆదర్శమన్నారు. రాష్ట్ర అభివృద్ధి చూసి ప్రతి పక్షాలు ఓర్వలేకనే లేనిపోని విమర్శలు చేస్తున్నాయని తెలిపారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం :

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కి ట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఇంటి వద్దకే పారదర్శకంగా అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు ముఖ్యమంతి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యకర్తల జీతాల పెంపుకు తమవంతు కృషి ఉంటుందని చెప్పారు. నాడు నేడు పథకంలో అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం చేయడానికి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, గజ్జెల శృతి, కలకడ ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్‌లు బి.సి. జయలక్ష్మీదేవి, డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ షఫీ, డైరెక్టర్లు సుగుణమ్మ, నాగరాజమ్మ, వైస్ ఎంపీపీలు చలపతి, హరిత, నాయకులు హుమయూన్, రవీంద్రనాథరెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, ఎం. సురేంద్రనాథరెడ్డి, అహ్మద్‌బాషా, బి.సి. అమరనాథరెడ్డి, నారే వెంకటరమణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, అమరనాథరెడ్డి, చిన్నయల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే ఉద్రిక్త పరిస్థితులు

ఎస్పీ ఆర్.గంగాధరరావు

మదనపల్లె : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నమయ్య జిల్లా పర్యటనలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందునే అంగళ్లలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో చంద్రబాబు పర్యటనకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొద్ది షరతులతో అనుమతులు మంజూరు చేశామన్నారు. ములకలచెరువు మండలం నాయునిచెరువు లిఫ్ట్ ఇరిగేషన్ ఛానల్ పరిశీలించేందుకు వచ్చిన చంద్రబాబు ఇతర పార్టీల వ్యక్తుల మనోభావాలు దెబ్బతినేలా కొన్ని అనవసర వ్యాఖ్యలు చేశారన్నారు. ఏ షరతులతో చంద్రబాబు పర్యటనకు అనుమతులిచ్చామో, వాటిని ఆయన అతిక్రమించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే గందరగోళం ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయపార్టీలు జరిపే ర్యాలీలు, ప్రదర్శనలకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. పోలీసుశాఖ సమష్టిగా పనిచేస్తూ పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నప్పటికీ రెచ్చగొట్టేలా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. అంగళ్లు క్రాస్‌లో జరిగిన ఘటనపై చట్టప్రకారం విచారణ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్పీ కేశప్ప, టూటౌన్ సీఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు

పీలేరు రూరల్ : వరిసాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని కలికిరి కేవీకే శాస్త్రవేత్తలు సోమశేఖర్, వై. పీరూసాహెబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముడుపులవేములలో డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగు చేసిన వరిపొలంను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలంలో ఊద కలుపు నివారణకు క్లించర్ అనే మందు లీటర్ నీటికి రెండు మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు.

నాటు విధానంలో సాగు చేసిన తెలంగాణా సోనా వరి రకంలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు సమస్యను గుర్తించడం జరిగిందని, ఈ పురుగు నివారణకు కోరాజెన్ మందును లీటర్ నీటికి 0.3 మిల్లీ లీటర్లు చొప్పున, పొటాషియం నైట్రేట్ ఎరువు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. గట్లపై వివిధ రకాల కలుపుమొక్కలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సునీత, మాధురి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు సోమశేఖర్, వై. పీరూసాహెబ్

మహిళా లెక్చరర్ హత్య విచారకరం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పట్టణంలో మహిళా లెక్చరర్ రుక్సానా దారుణహత్యకు గురికావడం విచారకరమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో రుక్సానా మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. హత్యఘటనకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ప్రశాంతతకు మారుపేరైన మదనపల్లెలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, సభ్యసమాజం తలదించుకునేలా మహిళను నడిరోడ్డుపై హత్యచేయడం అత్యంత దారుణమన్నారు. నిందితులు ఎంతటివారైనా విడిచిపెట్టేది లేదని, కఠినశిక్ష పడేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కుటుం బసమస్యల కారణంగా హత్య జరగడం బాధాకరమన్నారు. కుటుంబసమస్యలు ఏర్పడినప్పుడు పెద్దమనుష్యులు, పోలీసుల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలకు దారితీస్తే కఠినచర్యలు తీసుకునే విధంగా పోలీసులను ఆదేశిస్తామన్నారు. లెక్చరర్ రుక్సానా మృతదేహానికి పోస్టుమార్టం తర్వాత కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, గుండ్లూరు రఫీ, బాబ్‌జాన్, ఎల్ఐసీ.సుధాకర్, కౌన్సిలర్ మేస్త్రీశ్రీనివాసులు, మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ ప్రసాదరాజు, డాక్టర్ పాల్‌రవికుమార్ ఉన్నారు.



రుక్సానా తండ్రి మహమ్మద్ అలీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ఉర్దూ కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

వాల్మీకిపురం: ఉర్దూ అకాడమీ, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డీడీఈఓ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. శుక్రవారం వాల్మీకిపురం ఉర్దూ అకాడమీ ఉచిత శిక్షణ కోర్సుల ఉత్తర్వులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైనార్టీల సంక్షేమం, ఉర్దూ భాషాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 36 ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 40ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలని, ఉర్దూ భాష చదవడం, రాయడం వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 9398856388, 9247247828ను సంప్రదించాలని ఆయన కోరారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు

కలికిరి: పట్టణ పరిధిలోని కలకడ రోడ్డులో వెలసిన అంకాలమ్మ ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, హోమం, భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం, అమ్మవారికి దీలు, బోనాల సమర్పణ, అన్నదానం, ఆదివారం విశేష పూజలు, అలంకరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'మా బామ్మ కథలు' పుస్తకావిష్కరణ

మదనపల్లె సిటీ: ప్రముఖ రచయిత వియోగి (కోపల్లె విజయప్రసాద్), విశాల దంపతులు ప్రచురించిన బాలల గ్రంథం 'మా బామ్మ కథలు' గ్రంథావిష్కరణ జరిగింది. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైనత్య స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు ఆవిష్కరించారు.

ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ వియోగి బాలల పేరుతో కథల పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో ఇలాంటి పుస్తకాలు పిల్లలకు అవసరమన్నారు. రచయితలను అభినందించారు. ఆయన రచించిన బహుగ్రంథాలను వివరించారు. కార్యక్రమంలో ప్రజాచైతన్య స్రవంతి అధ్యక్షులు తిరుపతిరావు, శ్రీనివాసులునాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



'మా బామ్మ కథలు' పుస్తకావిష్కరణ చేస్తున్న రచయితలు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తంబళ్లపల్లె: విధి వైపరీత్యాలతో కుటుంబ అండను కోల్పోయి కష్టాలలో ఉన్న మొరుసుపుకాపు(ఒక్కలిగారు) బాధిత కుటుంబాలు అధైర్యపడకూడదని ఆ సంఘం అండగా నిలుస్తుందని ఆంజనేయరెడ్డి, శివారెడ్డి తెలిపారు. శుక్రవారం కదిరినాథునికోటకు చెందిన పారిశ్రామికవేత్త, ఎన్ఆర్ఐ జయచంద్రారెడ్డి ఆర్థిక సహకారంతో మండలంలోని పలు బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. కోసువారిపల్లె పంచాయతీ నల్లతిమ్మిరెడ్డిగారిపల్లె నవనీత కుటుంబానికి రూ.10వేలు, కె.కొండ్రెడ్డి వైద్య ఖర్చులకు రూ.2వేలు, పెద్దగుట్టపల్లె సరస్వతమ్మ కుటుంబానికి రూ.10వేలు, రెడ్డికోట పంచాయితీ కలుపువారిపల్లెకు చెందిన అమరావతమ్మకు రూ.10లు, రామచంద్రారెడ్డి కి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. దాత జయచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మొరుసుకాపు సంఘం ప్రతినిధులు జనార్ధనరెడ్డి, డాక్టర్ వెంకటరమణారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మొరుసుకాపు సంఘం ప్రతినిధులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి

మదనపల్లె సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరని ఎంఈఓలు రెడ్డన్నశెట్టి, నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులు రెడ్డన్నశెట్టి, నారాయణలు మాట్లాడుతూ బదిలీ పొందిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి ఆల్‌బెండజోల్ మాత్రలు

కలకడ : ప్రతి చిన్నారికి ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించే బాధ్యత విద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిపై ఉందని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిన్నారులందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలని తెలియజేశారు. 17వ తేదీన మ్యాప్ అప్‌డేట్ చేసి వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జవహర్‌బాబు, మోహన్, హెంపీహెచ్ ఈఓలు వెంకటేశు, జయరామయ్య పాల్గొన్నారు.



ఆల్‌బెండజోల్ మాత్రలను అందజేస్తున్న ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి

నులిపురుగు నివారణతో ఎదుగుదల

తంబళ్లపల్లె: నులిపురుగు నివారణతోనే చిన్నారుల్లో ఎదుగుదల సాధ్యమని ఎంపీహెచ్ఈవో రమణ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ నెల 10వ తేదీ నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది సమిష్టిగా విజయవంతం చేయాలన్నారు. మండలంలో 1-19 ఏళ్లలోపు పిల్లలు 4478 మందిని గుర్తించామని, వారికి నులిపురుగు నివారణ మాత్రలు మింగించాలన్నారు. మధ్యాహ్న భోజనం అయిన తరువాత 1-2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 3 నుంచి 19 ఏళ్లపిల్లలకు ఒకమాత్ర మింగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవో త్యాగరాజు, డాక్టర్ సుకుమార్ పాల్గొన్నారు.